



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
జూలై 30, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## జలదోపిడీ ఆపాల్సిందే!

**రాష్ట్ర రైతాంగ సంక్షేమం కోసం రాజీ లేని పోరాటాలు**

**బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఎట్టిపరిస్థితుల్లో నిలువరించాల్సిందే**

**చంద్రబాబు, మోడీ కోసం సిఎం తహతహలాడుతున్నారు**

**కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టారు**

**రాష్ట్రంలో తీవ్రంగా యూరియా కొరత**

**బిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో రాష్ట్ర రైతాంగ సంక్షేమం కోసం, వ్యవసాయ సంక్షోభాన్ని నివారించడం కోసం రాజీలేని పోరాటాలు మరింత ఉధృతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాగునీటి రంగాన్ని ఆగం చేసే దిశగా ఆంధ్రా ప్రభుత్వం నిర్మించనున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఎట్టిపరిస్థితుల్లో నిలువరించాల్సిందే అని స్పష్టం చేశారు. అందుకు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులను క్షేత్ర స్థాయిలో పోరాటాల కోసం కార్యోన్ముఖులను చేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర రైతాంగ సంక్షేమం కాపాడడం వ్యవసాయ సంక్షోభాన్ని నివారించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పాలన వైఫల్యాలను ఎండగడుతూ తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు పార్టీ తరఫున క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణ మీద ఎర్రవెల్లి నివాసంలో అధినేత కెసిఆర్ సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రులు పార్టీ సీనియర్ నేతలు తన్నీరు హరీశ్ రావు, జి. జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ అధినేత కెసిఆర్ పలు సూచనలు, దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి ఆంధ్రా ప్రయోజనాలను కాపాడేందుకు స్వయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే పాలనా విధానాలను అమలు చేయడం దుర్మార్గం అని మండిపడ్డారు. తమను నమ్మిన పాపానికి, తెలంగాణ రైతాంగానికి.. శాశ్వత అన్యాయం వడిగడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు వైఖరిని తీవ్రంగా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఇక్కడ చంద్రబాబు..

(మిగతా 2వ పేజీలో)

## ఆ దుస్థితి హైదరాబాద్‌కు వద్దు

**ఢిల్లీ నగరంలా హైదరాబాద్ కాలుష్య కోరల్లో చిక్కుకోకూడదు**



**పుర పాలక, పట్టణాభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష**

**కాలుష్యరహితంగా హైదరాబాద్**

**అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

**వచ్చే 25 ఏళ్ల అవసరాలు దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు**

**ఔటర్ రింగు రోడ్డు వెలుపలకు పరిశ్రమలు**

**సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం**

**భూగర్భ డ్రైనేజీ, కేబులింగ్‌పై సమగ్ర డీపీఆర్‌లు**

హైదరాబాద్: హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చి పర్యావరణ హితంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తీవ్ర కాలుష్యంతో ఢిల్లీ, ముంబై, చెన్నై వంటి నగరాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నగరానికి అవసరమైన భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నగరం నడిరోడ్డున (కోర్ సిటీ) ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ రింగు రోడ్డు వెలుపలకు తరలించాలని ఆదేశించారు. మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

### ప్రత్యేక ప్రణాళిక రూపొందించండి

హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు వచ్చే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు సిద్ధం చేయా లని సీఎం చెప్పారు. నగరంలో భూగర్భ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ కేబులింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని శాఖలు సమగ్ర డీపీఆర్‌లు తయారు చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడంతో పాటు నిర్మాణ రంగ వ్యర్థాలను ఇష్టారీతిన డంప్ చేయకుండా చూడాలని ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా డంప్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో మంచినీరు, మురుగు నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సంస్కరించాలని చెప్పారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేలా, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా సీవరేజీ బోర్డు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

### పర్యాటక ప్రదేశాలుగా వారసత్వ కట్టడాలు

ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న వారసత్వ కట్టడాలను సంరక్షించడంతో పాటు పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకు కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలను సవరించాలని సీఎం రేవంత్ సూచించారు. పాతబస్తీలో మెట్రో రైలు మార్గం పనులపైనా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆరా తీశారు. మెట్రో విస్తరణకు అవసరమైన నిధులు విడుదల చేసిన నేపథ్యంలో పనులు వేగవంతం చేయాలన్నారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటేడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని

(మిగతా 2వ పేజీలో)




## స్థానిక ఎన్నికల్లో గెలిచి తీరాల్సిందే: మీనాక్షి నటరాజన్



## భూ వివాదం.. సుప్రీంలో సిఎం రేవంత్‌కు ఊరట

## 18 ఏళ్ల తర్వాత జులైలోనే నాగార్జున సాగర్ జలాశయం నిండింది: ఉత్తమ్





## సిందూర్ ఆపాలని ఏ దేశాధినేతా చెప్పలేదు

**'ఆపరేషన్ సిందూర్' చర్చలో మోదీ స్పష్టీకరణ .. కాంగ్రెస్‌పై నిప్పులు**

**న్యూఢిల్లీ: నిఘా వైఫల్యం కారణంగా పహల్గాంలో అత్యంత పాశవిక దాడి జరిగిందని, ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సాధించిన కీలక విజయాలేంటో చెప్పాలంటూ విపక్షాల డిమాండ్ల మధ్య లోక్‌సభలో ప్రధాని మోదీ సూటిగా సమాధానమిచ్చారు. భారత్, పాక్ పరస్పర సైనిక చర్యలు పరిసమాప్తం కావడానికి తానే ముఖ్యకారణమని ఇప్పటికే పాతికసార్లు ఢంకా భజాయించిన ట్రంప్ మాటల్లో రవ్వంతైనా నిజంలేదని స్పష్టంచేశారు. ఉగ్రవాదాన్ని కాళ్లకింద నలిపేసేటప్పుడు ప్రపంచంలో ఏ దేశం వారించినా ఊరుకునేది లేదని వ్యాఖ్యానించారు. సిందూర్ తక్షణం ఆపేయాలని ప్రపంచంలో ఏ దేశ నేతా తమకు చెప్పలేదని మోదీ స్పష్టం చేశారు. 102 నిమిషాల ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..**

"ఉగ్రవాదానికి కుంభస్థలం వంటి పాక్‌లోని ఉగ్ర స్థావరాలను మనం నేలమట్టంచేసినందుకు ఈ రోజు పార్లమెంట్‌లో విజయోత్సవం జరుపుకుంటు న్నట్లు అనిపిస్తోంది. భారత వాణిని ప్రపంచానికి వినిపించేందుకు, భారత్ అంటే ఎంటో అందరికీ మరోసారి చాటిచెప్పం దుకే మాట్లాడుతున్నా. సిందూర్ వేళ నాపై నమ్మకం ఉంచిన ప్రజలందరికీ రుణపడిపోయా. ఉగ్రవాదానికి తల్లివేరు వంటి పాక్‌కు ఆపరేషన్ సిందూర్‌తో అసాధారణరీతిలో గుణపాఠం చెప్పాం. ఆ భీకర దాడుల నుంచి పాక్ ఇంకా కోలుకోలేదు. దాడులు మళ్లీ జరగొచ్చని వాళ్లు ఇప్పటికీ భయంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఆపరేష్ సిందూర్ అమలుకోసం మేం సైనిక బలగాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చాం. పహల్గాం దుశ్చర్యకు దీటుగా బదులిస్తూ పాక్ నడిబొడ్డున క్షిపణుల వర్షం కురిపించాం. కేవలం 22 నిమిషాల్లో

(మిగతా 2వ పేజీలో)



## మన సైనికుల చేతులు కట్టేశారు: రాహుల్

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ అంశానికి సంబంధించి పార్లమెంట్‌లో వాడివేడి మాటల యుద్ధం జరుగుతోంది. మంగళవారం కాంగ్రెస్ అటు రాజ్యసభ, ఇటు లోక్‌సభ వేదికగా ప్రశ్నల వర్షం కురిపించింది. ఇప్పటికే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , ప్రియాంక గాంధీలు తమ వాదనలతో కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడగా, సీనియర్ నేత రాహుల్ గాంధీ కూడా ఆపరేషన్ సిందూర్‌పై ప్రభుత్వం తీరును తప్పుపట్టారు. లోక్‌సభలో ఆయన మంగళవారం మాట్లాడుతూ.. మన సైనికుల్ని యుద్ధానికి పంపి వారి చేతుల్ని కేంద్ర ప్రభుత్వం కట్టేసిందని మండిపడ్డారు. అందుకే మన యుద్ధ విమానాలు కూలాయన్నారు. భారత్ పాక్‌ల యుద్ధాన్ని ఆపానని ట్రంప్ ఇప్పటికి 29 సార్లు చెప్పారు. ట్రంప్ అబద్ధాలు చెబుతున్నప్పుడు మోడీ తిరిగి ఎందుకు ప్రశ్నించలేదు ?ఇందిరాగాంధీ ప్రదర్శించిన ధైర్య సాహసాల్లో 50 శాతం కూడా మోడీ చూపించలేదు. మరి ట్రంప్‌తో కలిసి మునీర్ లంచ్ చేస్తారు. ఆయన్ని ట్రంప్ ఆహ్వానిస్తారు. ట్రంప్‌మునీర్‌ల లంచ్ విషయాన్ని మోడీ ఎందుకు ఖండించలేదు. ? జైశంకర్ విదేశాంగ విధానం ఫెయిల్ అయ్యింది' అని

(మిగతా 2వ పేజీలో)

## బీసీ బిల్లుకు కేంద్రం అడ్డంకులు

**దీనిపై త్వరలో రాష్ట్రపతిని కలుస్తాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**తాండూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



తాండూరు: రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఈ విషయమై త్వరలోనే మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి రాష్ట్రపతిని కలవనున్నట్లు చెప్పారు. బీసీ బిల్లు ఆమోదాన్ని రాజకీయ కోణంలో చూడొద్దని కేంద్రానికి సూచించారు. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి భట్టి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణ శివారులోని జీపీఆర్ గార్డెన్‌లో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లపాటు ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో విసిగిపోయిన ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదముద్ర వేయించామన్నారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకుగాను 95 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రేషన్ కార్డు కలిగిన వారికి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య సేవలు అందిస్తున్నామని భట్టి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఇందిరమ్మ పథకం కింద పేదలకు సొంత ఇళ్లు

(మిగతా 2వ పేజీలో)





# ప్రకృతి సౌందర్యానికి చారిత్రక ప్రదేశాలకు సోమశిల ప్రసిద్ధి!

## నల్లమల్ల పచ్చదనం... కృష్ణానది ప్రవాహం ఆధ్యాత్మిక సౌరభం ఈ ప్రాంతం!

## ఒకవైపు సంగమేశ్వరాలయం.... మరొకవైపు సోమేశ్వరాలయం పుణ్యరాశిగా వెలసిన ఆధ్యాత్మిక సౌరభం!

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : తెలంగాణలోని నాగర్ కర్నూల్ జిల్లాలో ఉన్న ఒక అందమైన పర్యాటక ప్రదేశం సోమశిల నల్లమల పచ్చదనం, కృష్ణానది ప్రవాహం, ఆధ్యాత్మిక సౌరభం..ఇలా కొల్లాపూర్ ప్రత్యేకతలు మరెన్నో తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సోమశిల పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందింది. కృష్ణానదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి పనులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నారు. దీంతో సోమశిల టూరిజం జంక్షన్‌గా రూపుదిద్దుకోనున్నది. ఆవైపు సంగమేశ్వరాలయం, ఈవైపు సోమేశ్వరాలయం.. పుణ్యరాశిగా వెలిశాయి. ఇక్కడి ప్రకృతి అందాలు పాపికొండలకు దీటుగా నిలుస్తాయి. దీంతో పర్యాటకులు సోమశిలకు బారులుకడుతున్నారు. ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామం, ట్రెక్కింగ్ మరియు ఇతర సాహస క్రీడలను ఆస్వాదించవచ్చు, సోమశిల సమీపంలోని అమరగిరి కూడా ఒక అద్భుతమైన ప్రదేశం, కృష్ణ జలాశయం యొక్క నీలిరంగు కలయిక కనులను విందుగా చేస్తుంది తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి రూ.90 కోట్లు వెచ్చించింది. రూ. 20.86 కోట్లతో సోమశిలలో కాటేజీలు, లాంచీలు, హోటళ్లు ఏర్పాటుచేసింది. పర్యాటకశాఖ నేతృత్వంలో సోమశిల నుంచి శ్రీశైలం వరకు సాగే లాంచీ యాత్ర మరపురాని అనుభూతి. మార్గమధ్యలో ఆంకాళమ్మకోట, పక్కనే నది మధ్యలో వెలసిన ద్వీపంలో జాలర్ల నివాసాలు అబ్బురపరుస్తాయి. కాకపోతే ఆ వైభోగాన్ని నీళ్లు అడుగంటేలోపే చూడాలి. భారతదేశంలోనే తొలిసారిగా తెలంగాణలో సోమశిల–కొత్తపల్లి (నంద్యాల జిల్లా) మండలం సిద్ధేశ్వరం మధ్య రెండు కొండల నడుమ కృష్ణానదిపై 1.077 కిలోమీటర్ల ఐకాన్ కేబుల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇది కనుక పూర్తయితే.. ఈ ప్రాంతానికి మరింత పర్యాటక శోభ ఖాయం!

**వార్త మిర్రర్ యాదాద్రి భువనగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ సాగర్**



# భూవివాదం.. సుప్రీంలో సిఎం రేవంత్‌కు ఊరట



హైదరాబాద్: భూ వివాదంలో సుప్రీంకోర్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భారీ ఊరట లభించింది. రేవంత్ రెడ్డిపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ బి.ఆర్.గవాయ్ ధర్మాసనం కొట్టివేసింది. అంతేకాకుండా పిటిషనర్, అతని తరఫు న్యాయవాదిపై సిజె ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారికి కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేశారు. ఈ కేసును మొదట హైకోర్టు కొట్టివేయగా, దానిని సవాల్ చేస్తూ పిటిషన్‌దారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా హైకోర్టు చీఫ్ జస్టీస్‌పై పిటిషన్‌దారు చేసిన అభియోగం పట్ల సిజె ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కేసు పూర్వాపర్వాలు ఇలా ఉన్నాయి. గోపన్‌పల్లిలో సర్వే నెం. 127లోని 31 ఎకరాలకు సంబంధించి ఎస్సీ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సోసైటీకి, రేవంత్ రెడ్డి సోదరుడు ఎ. కొండల్ రెడ్డి, ఎ. లక్ష్మయ్య మధ్య 2020 లో జరిగిన వివాదంలో ఎన్ పెద్దిరాజు అనే వ్యక్తి అప్పుడు ఎంపిగా ఉన్న రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో సోసైటీ స్థలంలోకి అక్రమంగా చొరబడ్డారని, అడ్డుకున్న తనను కులం పేరుతో దూషించారంటూ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులను కొట్టి వేయాలంటూ రేవంత్ రెడ్డి 2020లో హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేసారు. ఈ కేసును విచారించిన ధర్మాసనం సరైన ఆధారాలు లేకపోవడంతో రేవంత్ రెడ్డిపై నమోదైన కేసును ఇటీవల కొట్టివేసింది. హైకోర్టు తీర్పు పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిటిషన్ దారుడు పెద్ది రాజు ఈ కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన సిజెఐ జస్టిస్ బి.ఆర్ గవాయ్ ధర్మాసనం రేవంత్‌రెడ్డికి ఇందులో సంబంధం ఉన్నట్టు సాక్షాధారాలు లేవని వ్యాఖ్యానిస్తూ కేసు కొట్టివేసింది.

### పిటిషనర్, న్యాయవాదికి ధిక్కరణ నోటీసులు జారీ

ఈ పిటిషన్ విచారణ సందర్భంగా పిటిషనర్, న్యాయవాది రితేష్ పాటిల్‌పై సిజెఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిటిషన్‌లో హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరక వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు. పిటిషన్ దాఖలు చేసేటప్పుడు పరిశీలించుకోవాలని, ఒక న్యాయవాదిగా ఉంటూ న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేస్తూ పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని సిజెఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిటిషనర్ పెద్దిరాజుతో పాటు, ఆయన న్యాయవాదికి ధిక్కరణ నోటీసులు జారీ చేయగా, కోర్టు సాక్షిగా పిటిషనర్ తరపున న్యాయవాది రితేష్ పాటిల్ ధర్మాసనాన్ని క్షమాపణ కోరారు. పిటిషన్ ఉపసంహరించుకోవడానికి అనుమతించాలని కోరగా, సిజెఐ అందుకు నిరాకరించారు. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలన్నారు. పిటిషన్ దాఖలు చేసేముందు పరిశీలించుకోవాల్సిన బాధ్యత న్యాయవాదిపై ఉంటుందని వ్యాఖ్యానించారు. కోర్టు ధిక్కరణ నోటీసులపై లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని, సమాధానం ఆమోదయోగ్యంగా ఉంటేనే కోర్టు పరిగణలోకి తీసుకుంటుందని సిజె గవాయి స్పష్టం చేశారు. ఈ కేసును ఆగస్ట్ 11వ తేదీకి వాయిదా వేస్తూ, ఈ సారి విచారణకు పిటిషనర్ వ్యక్తిగతంగా హాజరు కావాలని కూడా ఆదేశించారు.

### ఇది కేసు నేపథ్యం

గోపన్ పల్లిలో సర్వే నెం. 127లోని 31 ఎకరాలకు సంబంధించి వివాదంలో ఎస్సీ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సోసైటీకి, రేవంత్ రెడ్డి సోదరుడు ఎ. కొండల్ రెడ్డి, ఎ. లక్ష్మయ్యల మధ్య వివాదం జరిగింది. ఈ క్రమంలో ఎన్ పెద్దిరాజు 2016 సంవత్సరంలో అప్పటి ఎంపిగా ఉన్న రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో సోసైటీ స్థలంలోకి అక్రమంగా చొరబడ్డారని, అడ్డుకున్న తనను కులం పేరుతో దూషించారంటూ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్ది రాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులను కోట్టి వేయాలంటూ రేవంత్ రెడ్డి 2020లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో గతంలోనే జస్టిస్ మౌసమి భట్టాచార్య విచారణ చేపట్టారు. ఘటనా స్థలంలో రేవంత్ రెడ్డి లేకున్నా రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కేసు నమోదు చేశారని, రేవంత్ రెడ్డి తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. పెద్దిరాజు 2014 వ సంత్సరంలోనే చందానగర్‌లో రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు చేశారని, సరైన ఆధారాలు లేకపోవడంతో ఆ కేసు కోట్టివేదసిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు కోర్టుకు తెలిపారు. పెద్దిరాజు తిరిగి 2016లో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, 8 మంది సాక్షుల వాంగ్మూలంలో రేవంత్ రెడ్డి ఘటనా స్థలంలో లేరని చెప్పారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్మాసనానికి వివరించారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం నిందితుడికి సంఘటనతో సంబంధం ఉన్నట్లు ప్రాసిక్యూషన్ ఎలాంటి ఆధారాలు సమర్పించలేకపోయిందని పేర్కొన్నారు. ఆరోపణల ఆధారంగా కేసు నమోదయిందని, నిందితుడు సంఘటనా స్థలంలో ఉన్నట్లు నిరూపించకుండా దోషిగా నిర్ధారించడానికి ఆరోపణలు ఆధారం కావని ధర్మాసనం తెలిపింది. కాగా, ధర్మాసనం తీర్పు ఉత్తర్వులు జారీ చేయడానికి ముందు ఫిర్యాది దారుడి తరుపున వాదించిన నాయ్యవాది, సుప్రీంకోర్టులో బదిలీ దరఖాస్తు దాఖలు చేయబడిందని, ఈ విషయాన్ని హైకోర్టులోని మరో బెంచి ఎదుట విచారణ జరిపించాలని కోరారు. తాజాగా ఈ బదిలీ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు సిజెఐ ధర్మాసనం కేసు కొట్టివేసింది.

# 18 ఏళ్ల తర్వాత జులైలోనే నాగార్జునసాగర్ జలాశయం నిండింది: ఉత్తమ్

హైదరాబాద్: నాగార్జున సాగర్ మనకు ఆధునిక దేవాలయం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సాగర్ నుంచి గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, అద్లూరి లక్ష్మణ్ నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. 18 ఏళ్ల తర్వాత జులైలోనే నాగార్జున సాగర్ జలాశయం నిండిందని తెలియజేశారు. సాగర్ కు దివంగత ప్రధాని నెహ్రూ గాంధీ పునాది వేస్తే దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించి గొప్ప ప్రాజెక్టు ఇది అని కొనియాడారు. సాగర్ కాలువల ద్వారా రెండు రాష్ట్రాల్లోని ప్రతీ ఎకరాకు నీరు చేరిందని, మన రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి పండిందని ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు.

# ఆ దుస్థితి హైదరాబాద్‌కు వద్దు

ఆదేశించారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ఓఆర్ఆర్ నుంచి మూసీ వైపు వచ్చే క్రమంలో కొత్వాల్‌గూడ జంక్షన్‌లో మూసీ రివర్ ఫ్రంట్‌కు ప్రతీకగా గేట్ వే ఆఫ్ ఇండియా, ఇండియా గేట్, చార్మినార్ తరహాలో ల్యాండ్ మార్క్‌ను నిర్మించాలని ఆదేశించారు.

### మీరాలం ట్యాంకు వద్ద అధునాతన హెూటల్

నెహ్రూ జూ పార్క్, మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల పురోగతిపైనా సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. జూ పార్క్, మీరాలం ట్యాంక్ సమీపంలో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అధునాతన వసతులతో హెూటల్ నిర్మించాలని ఆదేశించారు. జూ పార్క్, మీరాలం ట్యాంక్‌తో పాటు నగరాన్ని వీక్షించేలా హెూటల్ ఉండాలని సూచించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శులు ఇలంబర్తి, టీకే శ్రీదేవి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎఫ్‌సీడీఏ కమిషనర్ కె.శశాంక, వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిత్తల్, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, జేఎండీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో గెలిచి తీరాల్సిందే: మీనాక్షి నటరాజన్

హైదరాబాద్ : 'స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాల్లో విజయం సాధించాల్సిందేనని ..' ఏఐసిసి నాయకురాలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులను, కార్యకర్తలు ఆమె పరుగులు పెట్టిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 31 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ తొలి విడత పాదయాత్ర, పల్లె నిద్ర, శ్రమదానం చేయడానికి త్రిముఖ వ్యూహాన్ని ఆమె ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యే క్వార్టర్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పది ఉమ్మడి జిల్లాల పార్టీ ఇన్‌ఛార్జిలు, పార్లమెంటు వారీగా నియమితులైన ఇన్‌ఛార్జిలుగా నియమితులైన ఉపాధ్యక్షులు, పిసిసి ప్రధాన కార్యదర్శులు, జిల్లా పార్టీ అధ్యక్షులూ హాజరయ్యారు. అయితే ఆమె జిల్లాల వారీగా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పాదయాత్రలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని, జన సమీకరణ, భారీ ఏర్పాట్లు, పెద్ద ఎత్తున కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం గురించి మీనాక్షి సూచన చేశారు. ఈ నెల 31న రంగారెడ్డి జిల్లా పరిగిలో సాయంత్రం 5 గంటలకు పాదయాత్రకు ఆమె శ్రీకారం చుట్టనున్నారు. మీనాక్షి నటరాజన్‌తో పాటు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పార్టీ నాయకులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లూ పాదయాత్రలో పాల్గొంటారు.

# అమరావతి క్వాంటం వ్యాలీ ప్రయోజనాలు అందుకోండి

అమరావతిలో ఏర్పాటు చేస్తున్నామని... 2026 జనవరి నాటికి ప్రారంభమయ్యే క్వాంటం వ్యాలీ ఎకో సిస్టంలో సింగపూర్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశముందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ క్వాంటం వ్యాలీ ప్రాజెక్టు ప్రయోజనాలను సింగపూర్ కంపెనీలు పొందటంతో పాటు పరిశోధనలకూ ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామిక వేత్తలకు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూలంగా 20కి పైగా పాలసీలను అమలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. పారిశ్రామిక అనుకూల విధానాలతో పాటు పెట్టుబడులకు ఉన్న అవకాశాలను రౌండ్ టేబుల్ వేదికగా ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామిక వేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులకు వివరించారు. ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి.నారాయణ, ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### ఏపీ గ్రోత్ ఇంజిన్ గా విశాఖ

నగరాభివృద్ధి, వాణిజ్య సదుపాయాలు, మౌలిక వసతుల రంగాల్లో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన సింగపూర్‌కు చెందిన కెప్పెల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లిమ్ యాంగ్ వియ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. సింగపూర్ లో మూడో రోజు పర్యటనలో భాగంగా సీఎం వివిధ పారిశ్రామిక దిగ్గజ కంపెనీలతో బేటీ అయ్యారు. అమరావతి నగర అభివృద్ధిలో కెప్పెల్ భాగస్వామ్యంపై ప్రధానంగా ఇరువురి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రాభివృద్ధి కోసం విశాఖను గ్రోత్ ఇంజిన్‌గా మార్చే లక్ష్యంతో ఐటీ, వాణిజ్యం, గృహ నిర్మాణ రంగాల్లో ప్రాజెక్టుల అభివృద్ధికి కెప్పెల్‌ను ఆహ్వానించారు.

### జీఐసీతో దీర్ఘకాలిక భాగస్వామ్యం లక్ష్యం

అమరావతి నగర అభివృద్ధి, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, పరిశ్రమల రంగం అభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్ట్ మెంట్ కార్పోరేషన్ (జీఐసీ) సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ బ్రాన్ యోతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. జీఐసీతో దీర్ఘకాలిక భాగస్వామ్యం, స్థిరమైన పెట్టుబడులపై ప్రణాళికల రూపకల్పనపై చర్చించారు. వైద్య, విద్య, పట్టణ ప్రణాళిక, పౌర సదుపాయాలు వంటి రంగాల్లో జీఐసీ పెట్టుబడులు పెట్టేలా అనువైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆయా రంగాల్లో ఆంధ్రప్రదేశ్ అపారమైన అవకాశాలు ఉన్నాయని సీఎం స్పష్టం చేశారు.

### ఫుడ్ ప్రాసెసింగ్‌పై విల్మర్ ఆసక్తి

అలాగే, విల్మార్ ఇంటర్నేషనల్ సంస్థ గ్రూప్ హెడ్ రాహుల్ కలేతో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు... సమావేశంలో ఫుడ్ ప్రాసెసింగ్, ఎడిబుల్ ఆయిల్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. రైతులకు విలువ ఆధారిత మార్కెట్‌ను కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్‌లో సహకరించాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించగా విల్మర్ టెక్నాలజీ అందుకు ఆసక్తి వ్యక్తం చేసింది.

## ప్రజా పాలనలో ప్రతి పల్లెకు మద్యం దుకాణాల ఏర్పాటు చేయడం సిగ్గుచేటు .!

### బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ఆగ్రహం




యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : తెలంగాణలో అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి పాలన చేతకాక తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్న అసమర్ధత కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పగా ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ పల్లె పల్లెనా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియుల బలహీనతను తమ ఖజానాకు ఆదాయం వనరులుగా మార్చుకుంటున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో రాబోతున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ తెలంగాణ నీళ్లను ఆంధ్రకు నీళ్లు పంపిస్తూ, తెలంగాణ ఆదాయాన్ని ఢిల్లీకి పంపిస్తూ.! తెలంగాణ ఆదాయాన్ని దెబ్బతీస్తూ ఆదాయం కోసం, రాత్రిళ్ళు నిర్వహించాల్సిన డ్రంక్ అండ్ డ్రైవ్ ని ఉదయం పూట కూడా నిర్వహిస్తూ కూలినాలి జనాలపై పేద మధ్యతరగతి ప్రజలను నిలువు దోపిడీ చేస్తుంది. ఈ ప్రజా పాలన ప్రభుత్వం అన్నారు, ప్రజా పాలనని చెప్పుకుంటూ గ్రామాల్లో పారిశుధ్యం పై నిర్లక్ష్యం.! సంక్షేమ హాస్టల్ లపై నిర్లక్ష్యం.! ప్రభుత్వ హాస్పిటల్ లపై నిర్లక్ష్యం.! రైతు సంక్షేమంపై నిర్లక్ష్యం.! ప్రభుత్వ బడులపై నిర్లక్ష్యం.! గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై నిర్లక్ష్యం అని ఆవేదన వ్యక్తం చేశారు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కెసిఆర్ లాంటి మహా నాయకుని పై ప్రతి వేదికపై ఆరోపణలు చేస్తూ ప్రజల ఆదాయాన్ని గండి కొడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని త్వరలో ప్రజలు గద్దె దింపుతారని తెలిపారు



## విజయవంతంగా విశ్వబ్రాహ్మణ చైతన్య యాత్ర

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో విశ్వ బ్రాహ్మణ చైతన్య యాత్ర పేరుతో హైదరాబాద్ ట్యాంక్ బండ్ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహం దగ్గర నుండి శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, కందిమల్లాయపల్లె, ఆంధ్ర ప్రదేశ్ వరకు 450 కిలోమీటర్లు పాదయాత్ర విజయవంతంగా జరిగిందనీ సంఘం సభ్యులు తెలిపారు. ఈ పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జగన్మాత ఈశ్వరీ దేవి మఠాధి పతులు శ్రీశ్రీశ్రీ వీర శివకుమార స్వాములవారు, తెలంగాణ రాష్ట్ర మాజీ స్పీకర్ మధు సూదనా చారి, హైదరాబాద్ ఏసిపి కె కిరణ్ కుమార్, బాపట్ల జిల్లా బిజెపి అధ్యక్షులు కొండ ముది బంగారు బాబు లు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం పటాన్ చేరు నియోజకవర్గ అధ్యక్షులు కంజర్ల కృష్ణమూర్తి చారి,అఖిలభారత విశ్వకర్మ మహాసభ అధ్యక్షులు కౌలె జగన్నాధం, మధుచారి లు పాల్గొన్నారు. కృష్ణమూర్తి చారి మాట్లాడుతూ విశ్వకర్మలు అందరం ఐకమత్యంగా ఉండాలని, మన ఐక్యతే మనకు బలమని, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ అధ్యక్షుడు పుష్పగిరి ని మరియు పాదయాత్ర చేసిన వారి బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపి, ఇటువంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరుకున్నారు, ఈ కార్యక్రమంలో ఎందరో విశ్వకర్మలు పాల్గొన్నట్లు ఆయన తెలిపాడు.




## అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి జగదీశ్వర్ గౌడ్ అన్నారు.సోమవారం శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక నియోజకవర్గ ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను జోనల్ కమిషనర్ హేమంత్ భోర?డే తో కలిసి చర్చించారు..ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ గౌడ్,కిరణ్,సంగమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..



## చిలువేరు నరసింహ దశదిన కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని శ్రీ రాఘవేంద్ర ఫంక్షన్ హాల్లో గ్రామానికి చెందిన బాల్యమిత్రుడు చిలువేరు అంజయ్య ( ఆర్టీసీ) సీనియర్ రిపోర్టర్ చిలువేరు వీరేశం గారి తండ్రి చిలువేరు నరసింహా దశదినకర్మ కార్యక్రమాని హాజరై, వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, గ్రామ మాజీ సర్పంచ్ శికిలమెట్ల శ్రీహరి.బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాచకొండ రవీంద్ర చారి, కొండ గిరి గౌడ్, రసాల వెంకటేష్ సాగర్, తెలంగాణ బిక్షం, గుండమల్ల సతీష్, రిపోర్టర్ సికిలమెట్ల ప్రభాకర్, చిలువేరు వెంకులు, చిలువేరు బుగ్గ రాములు, గిరి తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్‌లో తెలంగాణ మైదాన ప్రాంత గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : తెలంగాణ మైదాన ప్రాంత గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జబ్బర్ నాయక్ అధ్యక్షతన మియాపూర్ యం. ఏ. నగర్ యం. సి. పి. ఐ. (యూ) పార్టీ ఆఫీసులో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ మైదాన ప్రాంత గిరిజన సంఘం రాష్ట్ర కన్వీనర్ వి తుకారాం నాయక్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో 50 లక్షల పైగా ఉన్న వారి చైతన్యాన్ని పెంచెందుకు సంఘటిత ఉద్యమాలను చేయాలని మహిళలు యువజనులను విద్యార్థుల వివిధ రంగాలలో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులలో గిరిజన సంఘంలో చేర్పించడానికి వారికోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని కోరడం జరిగింది . తాండల గ్రామపంచాయతీలను రెవిన్యూ గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి తండాల అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో ఎస్టీ లంబాడి ఏరుకుల యానాది చెంచులు ఆదివాసులు జనాభాను బహిర్గతం చేయాలి . ఎస్టీలు సాగు చేస్తున్న లావణ్య సీలింగ్ పోడు భూములను స్వాసితంగా పూర్తి హక్కులతో అసెంబ్లీలో చట్టం చేసి పట్టాలు ఇవ్వాలి రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో 100% రిజర్వేషన్ ఏర్పాటు ప్రభుత్వం అమ్ములు చేయాలి కేంద్ర ప్రభుత్వం ఎమ్మెల్యే ఎంపీల స్థానాలను పెంచే పునర్విభజన లో రాష్ట్రం జనాభా యూనిట్ గా కాకుండా జిల్లా జనాభా యూనిట్ గా ఆధారంగా ఎస్టీలను ఎమ్మెల్యే ఎంపీ రిజర్వేషన్ సీట్లు



కేటాయించాలి. ఎస్టీలను రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం 7.5% ను పెరిగిన జనాభా ఆధారంగా 14 శాతానికి పెంచాలి అని కోరడం జరిగింది. ఈ సమావేశంలో డి శివరాం నాయక్ శంకర్ నాయక్ బాలకృష్ణ నాయక్ సురేష్ నాయక్ లక్ష్మణ్ నాయక్ శంకర్ నాయక్ ఉదయ్ నాయక్ వెంకట్ నాయక్ అనిల్ నాయక్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# భూతులు మానుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టండి...

### స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే చేపట్టాలి

### సాగు నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించాలి

### జిల్లా కమిటీ సమావేశంలో జూలకంటి రంగారెడ్డి

నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి : ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం మానుకొని రాష్ట్ర అభివృద్ధి సంక్షేమంపై దృష్టి పెట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న పార్టీలతో పాటు ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు బూతు పురాణం సాగిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా గాలికి వదిలేసి వ్యక్తిగత దూషణలకు దిగడం సిగ్గుచేటు అన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ప్రధానంగా అభివృద్ధి, సంక్షేమం అమలు కోసం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పాలకులు ప్రతిపక్షల పార్టీల నాయకుల తీరును చూస్తే ప్రజల అసహ్యించుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు ప్రస్తుత పరిస్థితిలో అనేక ఇబ్బందులలో ప్రజలు ఉన్నారని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధానంగా నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు సాగు నుండి విడుదల చేసేందుకు షెడ్యూల్ ను ప్రకటించాలన్నారు. నిరంతరంగా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు బ్యాంకు రుణాలు, రుణమాఫీ వెంటనే



చేపట్టాలని పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఆరులైన వారందరికీ కొత్తగా పెన్షన్లు మంజూరు చేయాలని ఎన్నికల ముందు ఇచ్చిన ప్రకారం పెన్షన్ పెంచి ఇవ్వాలని కోరారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని పెండింగ్ ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు వ్యవసాయ ప్రణాళికను ప్రకటించాలన్నారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. కాలయాపన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామస్థాయిలో పాలకులు లేకపోవడం వల్ల గ్రామాల అభివృద్ధి కొంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి,నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మీనారాయణ, వీరేపల్లి వెంకటేశ్వర్లు, బండ శ్రీశైలం, సయ్యద్ హాశం తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి సీనియర్ నాయకులు వంగరి రఘుపతిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు, బిజెపి సీనియర్ నాయకులు వంగరి రఘు తల్లి వంగరి అనసూయ ఇటీవల మరణించగా.నేడు వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, గ్రామ మాజీ సర్పంచ్ శికిలమెట్ల శ్రీహరి రఘుతోవారు మాట్లాడుతూ ఇటీవల అన్న చనిపోవడం స్వల్ప వ్యవధిలోనే తల్లి చనిపోవడం బాధాకరమని అన్నారు ఆధైర్య పడవద్దు కుటుంబం కోసం ధైర్యంగా ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## మహిళా రక్షణ కోసం టోల్ ఫ్రీ నెంబరు181 మీ సద్విని చేసుకోవాలి



మిర్యాలగూడ , జూలై 28:-( వార్త మిర్రర్) మహిళల సహాయం, రక్షణ కోసం నిర్దేశించిన టోల్ ఫ్రీ నంబర్ 181ను సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత కోరారు. సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ మహిళలపై గృహింస, పని చేసే కోట వేధింపులు, లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులకు పాల్పడితే వెంటనే 181కు ఫోన్ చేయాలని కోరారు. అదేవిధంగా ఆడపిల్లల అమ్మకం, అక్రమ రవాణా నివారణ కోసం సమాచారం టోల్ ఫ్రీ నెంబర్ 181కు చేయాలని ఆమె కోరారు. మహిళా సమస్యలపై సలహాలు, కౌన్సేలింగ్, రక్షణకైహెల్ప్ లైన్ నంబర్ 181కు ఫోన్ చేయాలని ఆమె కోరారు. అదేవిధంగా చైల్డ్ లైన్ హెల్ప్ కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు ఫోన్ చేయాలని ఆమె కోరారు.అదేవిధంగాబాల్యవివాహాలు నివారణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తమ శాఖ ప్రయత్నిస్తున్నదని ఆమె తెలిపారు. మిర్యాలగూడ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడి బాట నిర్వహించడం వల్ల 211 అంగన్వాడిల్లో సుమారు 2,862 పిల్లలు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. అయితే కొంత మంది పిల్లలు హాజరు కావడం లేదని, కొంత మంది పిల్లలు హాజరైన పిల్లలు కొంత సమయం ఉండి వెళ్లి పోతున్నారని ఆమె తెలిపారు. వారిని చైతన్య పరచేందుకు తను సూపర్ వైజర్లు ఇంటింటికీ తిరిగి అంగన్వాడీకి నిరంతరాయం వచ్చేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని ఆమె తెలిపారు. అంగన్వాడిల్లో ప్రభుత్వ పరంగా లబించే లబ్ది గురించి తెలియజేస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట బ్లాక్ కో ఆర్డినేటర్ కవిత ఉన్నారు.

## అంగన్వాడిలకు పిల్లలు సక్రమంగా వచ్చేలా ప్రత్యేక కార్యక్రమం : ఐసిడిఎస్ పిఓ రేఖల మమత

మిర్యాలగూడ , జూలై 28:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడి కేంద్రాలకు పిల్లలు సక్రమంగా వచ్చేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్టు మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత తెలిపారు. సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ అంగన్వాడి బాట నిర్వహించడం వల్ల 211 అంగన్వాడిల్లో సుమారు 2,862 పిల్లలు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. అయితే కొంత మంది పిల్లలు హాజరు కావడం లేదని, కొంత మంది పిల్లలు హాజరైన పిల్లలు కొంత సమయం ఉండి వెళ్లి పోతున్నారని ఆమె తెలిపారు. వారిని చైతన్య పరచేందుకు తను సూపర్ వైజర్లు ఇంటింటికీ తిరిగి అంగన్వాడీకి నిరంతరాయం వచ్చేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని ఆమె తెలిపారు. అంగన్వాడిల్లో ప్రభుత్వ పరంగా లబించే లబ్ది గురించి తెలియజేస్తామని ఆమె తెలిపారు.



## విద్యార్థులు చదువులో ప్రావీణ్యం పొందేటట్లు ఉపాధ్యాయులు పనిచేయాలి

మిర్యాలగూడ, జూలై 28:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని నల్లగొండ జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం బిక్షపతి సోమవారం సందర్శించి పరిశీలించారు. విద్యార్థులతో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టులో మంచి ప్రావీణ్యం పొందేటట్లు ఉపాధ్యాయులు పనిచేయాలని తెలిపారు. కిచెన్ రూమ్ లోని ఆహార సామాగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కాకుండా తాగునీటి, పారిశుద్ధ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వేడివేడి ఆహార పదార్థాలు అందించాలని సూచించారు కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పార్వతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## రైల్వే, కాలువ కోసం సేకరించిన భూమిని రికార్డులో తొలగించాలి

మిర్యాలగూడ , జూలై 28:- (వార్త మిర్రర్) మాడ్గులపల్లి మండలం గజాలపురం గ్రామ శివారులో లో రైల్వే, ఎస్ఎల్బిసి కాల్వ కింద సేకరించిన సర్వే నంబర్ 86, 98లలో ఉన్న భూములను రికార్డుల్లోంచి తొలగించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ కు సోమవారం సమర్పించిన వినతిపత్రంలో ఆలిండియా కిసాన్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య కోరారు. ఆ సర్వే నంబర్ లతో గందరగోళం సృష్టిస్తున్నారని వెంటనే రైల్వే కోసం, కాల్వ కోసం సేకరించిన భూములను రికార్డుల్లోంచి తొలగించాలని ఆయన కోరారు.

## గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించాలి

## మాజీ ఎంపీటీసీ సభ్యులు గోవిందుల లావణ్య-జలపతి.



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 29 : జులై 25 తేదీన హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో జగిత్యాల జిల్లా నుండి పాల్గొన్న గొల్లపెల్లి మండలం లక్ష్మి పూర్ గ్రామానికి చెందిన చేపూరి మోక్షిత మెరుగైన ప్రదర్శన కనబరిచి కాంస్య పథకం గెలిచిన చేపూరి మోక్షత ను మాజీ ఎంపిటిసి గోవిందుల లావణ్య జలపతి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నిరుపేద కుటుంబానికి చెందిన మోక్షిత రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచడం అభినందనీయం అన్నారు. గ్రామీన స్థాయిలో ఎంతో మంది క్రీడాకారుల్లో ప్రతిభ దాగి ఉన్నదని సదుపాయాలు లేక వెనక బడుతున్నారని, గ్రామీన స్థాయి క్రీడాకారులకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తే జాతీయ స్థాయి అకాడమీలను తల ధన్నే ఫలితాలు ఫలితాలు తీసుకు వస్తారని క్రీడాకారులకు గ్రామీణ స్థాయిలో సరైన శిక్షణ అందుకే క్రీడాకారులు వెనక బడుతున్నారు అన్నారు. రాష్ట్ర స్థాయిలో పథకం గెలిచిన మోక్షిత ని తన విజయానికి గ్రామీణ స్థాయి క్రీడాకారులకు ఉచిత శిక్షణ ఇస్తున్న కోచ్ మహేందర్ పటేల్ కి కృతజ్ఞతలు తెలిపారు. విజయం సాధించిన క్రీదాకారిణిని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ గువ్వా శ్రీనివాస్ డివైఎస్ఓ రవికుమార్, బిఆర్ఎస్ వి రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి, అసోసియేషన్ సభ్యులు రాజు, రాజేందర్, సీనియర్ జాతీయ స్థాయి క్రీడాకారిని సోనియాను అభినందించారు.



## మిగులు భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి...

## ఆర్.యు.పి.పి రాష్ట్ర సహాధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్...

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 29 : మిగులు భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు రాష్ట్ర శాఖ సహాధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి చంద సత్యనారాయణలు అన్నారు. దమ్మన్నపేట్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు డిండిగాల మురళీకృష్ణ ఉద్యోగ విరమణ మహోత్సవ సందర్భంగా ఆయనను ఘనంగా శాలువాతో సత్కరించారు. భగవద్గీత ప్రదానం చేశారు. ఆయన ఉపాధ్యాయ జీవితంలో చేసిన సేవలు కొనియాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1/2005 అక్ట్ రద్దు చేసి భాషోపాధ్యాయులకు నియామకం తేది నుండి నోషనల్ సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించాలని, 24 సంవత్సరాల సర్వీసు పూర్తి అయిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు గెజిటెడ్ హెరీదా కల్పించాలని, ప్రాథమిక పాఠశాలల్లో హిందీని ప్రవేశపెట్టి తెలుగు హిందీ పండితులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొరండ్ల సత్యం రెడ్డి, రంగు రమేష్ గౌడ్, జోంగోని రాజేశం, మ్యాడవరం పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ కాలనీ ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కు ఏ డబ్ల్యూజేప వినతి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి 29 : జర్నలిస్ట్ కాలనీ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం రోజున జగిత్యాల జిల్లా రాయికల్ తహసీల్దార్ నాగార్జునకు ఆల్ ఇండియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏ డబ్ల్యూ జే ఏ) రాయికల్ మండల శాఖ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయికల్ పట్టణములో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయని, లబ్దిదారుల ఎంపిక కూడ జరుగలేదని అన్నారు. గత అనేక సంవత్సరాల నుండి ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి అనేక సమస్యల పరిష్కార దిశగా పనిచేస్తున్న జర్నలిస్ట్ లకు డబుల్ బెడ్ రూమ్ నిర్మించిన స్థలం మరియు దాని పరిసరాలలో ఉన్న రెండు ఎకరాల విస్తీర్ణం గల భూమిని జర్నలిస్ట్ కాలనీ కి కేటాయించాలని కోరారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు గా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న అసంపూర్తి నిర్మాణ సముదాయాన్ని పూర్తి చేసి సీనియారిటీ ప్రతిపదికన, అర్హత ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇండ్లను జర్నలిస్టులకు మంజూరు చేయగలరని విజ్ఞప్తి చేస్తున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఆల్ ఇండియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కడుకుంట్ల జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు కళ్లెం శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ రసూల్, చింతకుంట సాయికుమార్ మండల అధ్యక్షుడు ఇమ్మడి విజయ్ కుమార్, మరియు పాత్రికేయులు సిర్ప సంతోష్, గంట్యాల ప్రవీణ్, యాచమనేని కిరణ్ రావు, మహమ్మద్ షాకిర్, పడాల రమేష్, దుగ్యాల రామపతి రావు, మాలావత్ వెంకటేష్ పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి ని

## కలిసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్,ఎమ్మెల్సీ ఎల్ రమణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 29జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్ కె ఎన్ ఆర్ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాల 60 వసంతాల వేడుకకు రావాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో పాటు ఎమ్మెల్సీ రమణ తనయుడు ఎల్ కార్తికేయతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కండ్లపల్లి పాఠశాలకు, ఎస్ కే ఎన్ ఆర్ ఆర్ట్స్ కళాశాల బాల, బాలికలకు హాస్టల్లు మంజూరు చేయాలని కోరారు. అంతేకాకుండా జగిత్యాల డిగ్రీ కళాశాల ప్రారంభమై 60 వసంతాలు పూర్తయిన సందర్భంగా, ఈ సంస్థను యూనివర్సిటీగా లేదా స్కిల్ ఇండియా సెంటర్గా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కోరారు. ముఖ్యమంత్రి సానికూలంగా స్పందించి ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే కు 60 సంవత్సరాల ఉత్సవాలకు వస్తానని హామీ ఇచ్చారు.

## విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలి

## సీఐ విష్ణు వర్ధన్ రెడ్డి,ఎస్సై కురుమూర్తి



కల్వకుర్తి జూలై 29 వార్త మిర్రర్ ప్రతినిధి:-ఇంటర్ చదువుతున్న విద్యార్థులు చదువు పై మాత్రమే దృష్టి సారించాలని సీఐ విష్ణు వర్ధన్ రెడ్డి,ఎస్సై కురుమూర్తి తెలిపారు. మంగళవారం క్యూ న్యూస్,శనార్తి తెలంగాణ మీడియా,తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజక వర్గంలోని వెల్దండ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష ప్యాడ్ల పంపిణీ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా వెల్దండ సీఐ,ఎస్సై పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని,మంచి ఉద్యోగం సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే సంకల్పంతో చదవాలని సూచించారు. ఇంటర్ చదువు చాలా ముఖ్యమైనది అని చెప్పారు. బాగా చదువుకుంటే,మీ తల్లిదండ్రులకు మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం వల్ల కళాశాలకు, గ్రామాలకు,మండలాలకు మంచి పేరు ప్రాఖ్యాతలు వస్తాయని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని,ఎదగాలనే ఆకాంక్ష ఉండాలని,బీద కుటుంబంలో పుట్టామని ఎప్పడు అనుకోకుండా, చదువుపైన మాత్రమే దృష్టి సారించాలని చెప్పారు. ఫోన్ లకు,టీవీ లకు దూరంగా ఉండాలని అన్నారు. ఎటువంటి చెడు ఆలోచనలు, ఆలోచనలు రాకుండా ఉండేందుకు తల్లిదండ్రుల నుంచి సలహాలు,సూచనలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి పాలమూరు క్యూ న్యూస్, శనార్తి తెలంగాణ మీడియా స్టాపర్ ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి,మంచి ఫలితాలు సాధిస్తే,సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, అధ్యాపకులు ప్రవీణ,విజయ లక్ష్మి,శివ ప్రసాద్,రమేష్, సుమలత,అంజమ్మ,కిరణ్,చిదానందం,పర్వతాలు,ఖాజా బేగం,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డ్ సమస్యల పరిష్కారానికి 32 వ ను సందర్శించిన లిమున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ , జులై 29:-( వార్త మిర్రర్) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒక మార్పు అభివృద్ధికి మలుపు, స్వచ్ఛతపై తొలి అడుగు అనే వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని 32 వ వార్డు (బంగారుగడ్డ) కాంగ్రెస్ ఇంచార్జ్ అబ్దుల్ మోయిజ్ తో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ సందర్శించారు. ఆయా వార్డు పరిధిలోని సమస్యలను కాలనీవాసులతో తెలుసుకొని సత్వరమేపరిష్కరించేందుకు గాను, పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలు పరిసరాల పరిశుభ్రత పై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించేందుకు కమిషనర్ శ్రీనివాస్ వార్డులోని ఇంటింటికి ఇంచార్జ్ అబ్దుల్ మోయిజ్, మున్సిపల్ సిబ్బందితో కలిసి విస్తృతంగా పర్యటించారు. వార్డులో తాగునీటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. వీధి దీపాల ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అవసరం ఉన్న ప్రతి చోట నూతనంగా సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. మురికి కాలవలు నిర్మించాలని, భాగ్యనగర్ కాలనీ రోడ్ నెంబర్ 1, బంగారుగడ్డ మసీదు వద్ద, బంగారుగడ్డ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యుపీహెచ్సీ)ల వద్ద కల్వర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. బంగారుగడ్డ వాటర్ ట్యాంక్ వద్ద రోడ్డు సమీపంలో ట్యాంకు వద్ద చెట్లు తొలగించి శుభ్రపరచాలని కోరారు వాటర్ ట్యాంక్ సమీపంలోని వినాయకుని మండపం వద్ద మన్యువల్ ఛాంబర్ కట్టాలని విన్నవించుకున్నారు. స్నేహ చికెన్ సెంటర్ ప్రక్కన ఉన్న రోడ్డు గుంతల మయంగా మారిందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రోడ్డు మరమ్మత్తు పనులనువెంటనే చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా వార్డు



కాంగ్రెస్ ఇంచార్జ్ అబ్దుల్ ఎండి.మోయిజ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ సహకారంతో బంగారుగడ్డ 32 వార్డును అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్నారు. వార్డు అభివృద్ధి చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, వార్డ్ ఆఫీసర్స్, జవాన్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సినారె కలానికున్న ప్రత్యేకత శబ్దశక్తి అర్థ యుక్తి

మిర్యాలగూడ, జూలై 29:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం లోని జప్తి వీరప్ప గూడెం జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) 94వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుడిపాటి కోటయ్య మాట్లాడుతూ సినారే తన రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషిచేశారు అని అలాగే ఇప్పటి యువకులకు యువ సాహితీవేత్తలకు వారు రాసిన ఆధునికాంధ్ర కవిత్వం సాంప్రదాయాలు ప్రయోగాలు అన్న సిద్ధాంత గ్రంథం నేటికీ ప్రామాణికంగా ఉండటమే వారి యొక్క ప్రతిభకు నిదర్శనమని, వారి రచనల్లో శబ్దశక్తి, అర్థయుక్తి ఎంతోమంది ని ఆకర్షించిందని,సినీ వినీలాకాశంలో నిలిచిన అభినవ అక్షర కర్ణుడుగా "నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని దగ్గర నుండి నేటి అరుంధతి సినిమాలోని జేజమ్మ""""పాట వరకు ఎన్నో వందల పాటలను అందించి సినీ కవిగా కీర్తి గడించారని, ప్రపంచ సాహిత్య సమ్మేళనంలో తెలుగు భాష ప్రతినిధిగా పాల్పంచుకున్నారని ""పల్లెపరిమలం నింపుకొని మట్టిని ముద్దాడిన తెలంగాణ తేజం"" కనక వారి సాహిత్య కృషిని నేటి తరం కొనసాగించవలసిన ఆవశ్యకత ఉన్నదని అందుకే నేటి యువకులు, సాహితివేత్తలు వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎడవల్లి దామోదర్ రెడ్డి, పి జగదీశ్వర్ రెడ్డి, ఒట్టె మాధవి, టి శ్రీనివాసరెడ్డి, రవికుమార్, రేణుక విద్యార్థులు పాల్గొన్నారు



## మిర్యాలగూడలో ట్రాఫిక్ నియంత్రణకు మార్జిన్ స్టోపర్ల ఏర్పాటు

మిర్యాలగూడ జూలై 29:- (వార్త మిర్రర్) మిర్యాలగూడలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో బస్టాండ్ ఆవరణలో మెయిన్ రోడ్డుపై ఫుట్పాత్ వెంట ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ టీం ఆధ్వర్యంలో మార్జిన్ స్టాపర్లను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని బిఆర్ఎస్కెవి ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎండి నాజర్ ఆలిమీర్జా అన్నారు.. ట్రాఫిక్ సమస్యలో భాగంగా మన మిర్యాలగూడలో పూర్తి మార్కెటింగ్ వచ్చేసి బైపాస్ హనుమాన్ పేట ఫ్లైఓవర్ నుంచి రౌండ్ వరకు మెయిన్ రోడ్డుపై పూర్తి గృహ అవసరాలు, మానవ అవసరాలకు అవసరమైన అన్ని ఉపకరణాలు ఒక్క కిలోమీటర్ పరిధిలోనే జరుగుతున్నవి మన మిర్యాలగూడ దిన దిన అభివృద్ధి చెందుతుంది. ఎన్నో షాపింగ్ మాల్స్ మరెన్నో పెద్ద పెద్ద మార్కెటింగ్ సంస్థలు మిర్యాలగూడలో ఏర్పాటు అవుతున్నవి దీనికి అనుగుణంగా ప్రజల రవాణా కూడా బాగా పెరుగుతుంది. అందులో భాగంగా మిర్యాలగూడలో నూతనంగా వెడల్పు చేసి నిర్మించిన రోడ్డుపై ట్రాఫిక్ సమస్య చాలా జటిలం అయ్యింది. ట్రాఫిక్ సమస్యను ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, టీం బాగా పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ నియంత్రిస్తూ ఎప్పటికప్పుడు నూతన పంథాను మిర్యాలగూడలో ట్రాఫిక్ వారు రూపొందించ్చారు అందులో భాగంగా మంగళవారం మిర్యాలగూడ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా సాగర్ రోడ్డు, రౌండ్, నల్లగొండ రోడ్డు ఇరువైపులా మార్జిన్ స్టాపర్లను ఏర్పాటు చేసి ఆటోలను అక్కడ ఆపి ప్యాసింజర్లను దింపేందుకు వెసులుబాటును కల్పించారు. ఆటో డ్రైవర్లు, ఓనర్లు వ్యాపారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆ మార్జిన్లోనే ఆటో లను ఆపి పాసింజర్లను దింపాలన్నారు. ప్యాసింజర్లు , ఆటో డ్రైవర్లు ఓనర్లు సహకరించాలని కోరారు. మిర్యాలగూడలో మొట్టమొదటిసారిగా స్టాప్ మార్జిన్ ఏర్పాటు చేసిన డీఎస్పీ రాజశేఖర్ రాజు, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ టీంకు హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు



## మాదాపూర్ ప్రాంతాల్లో కార్డెన్ అండ్ సెర్చ్





మాదాపూర్ వార్త మిర్రర్ : పోలీసులు సమస్యాత్మక ప్రాంతాల్లో మాదాపూర్ పరిధిలో నీ సిద్ధిక్ నగర్, అంజయ్య నగర్,లో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించి పలు బెల్టు షాపులను గుర్తించి మద్యం బాటిళ్ళతో పాటు పలు వాహనాలు, సిలిండర్లను స్వాదీనం చేసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందులో డిసిపి వినీత్, అడిషనల్ డిప్యూటీ కమీషనర్ ఉదయ్ రెడ్డితో పాటు మాదాపూర్ ఇన్స్పెక్టర్ కృష్ణ మోహన్, 11 మంది ఇన్స్పెక్టర్లు, 25 మంది ఎస్సైలు పాల్గొని తనిఖీల్లో భాగంగా అక్రమంగా నడుపుతున్న 4 బెల్ట్ షాపులను గుర్తించి 1.20 లక్షల విలువైన పలు బ్రాండ్లకు చెందిన మద్యం సీసాలను స్వాదీనం చేసుకున్నారు. రూ. 1 లక్షల విలువైన 5 ఇండ్ల నుండి అక్రమంగా విక్రయిస్తున్న గుట్కా, పోగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. 21 పెద్ద సిలిండర్లతో పాటు 20 చిన్న సిలిండర్లు స్వాధీనం చేసుకోగా చట్టవ్యతిరేకంగా ఎల్పిజి గ్యాస్ను రీఫిల్ చేస్తున్న 3 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో భాగంగా గడువు ముగిసిన మొత్తం 48. ద్విచక్ర వాహనాలు, ఓ ఆటో ను స్వీధీనం చేసుకున్నారు. మొత్తం 80 మందిని పాపిలాన్ పరికరంతో తనిఖీ చేయగా, ఆస్తి నేరానికి పాల్పడిన ఒక నేరస్తుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేసిన వారిలో ఉన్నతాధికారులతో పాటు 10 మంది ఏఎస్సైలు, 80 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 40 మంది స్పెషల్ పార్టీ స్పెషల్, 83 మంది బెటాలియన్, 10 మంది సిసిఎస్, 10 మంది ఎస్టి, 10 మంది ఏహెచ్ఐటియు, 12 మంది డబ్ల్యూపిసిఎస్ కలిపి మొత్తం 250 మంది కార్డెన్ అండ్ సెర్చ్ లో పాల్గొన్నారు.



## గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి
## పిఆర్టియు టిఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు ఆనందరావు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 29: ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పిఆర్టియు టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు బోయినపల్లి ఆనందరావు అన్నారు. రాయికల్ మండలం సింగరావుపేట సోషల్ వెల్ఫేర్ స్కూల్ బాయ్స్ హై స్కూల్ లో ఉపాధ్యాయ సమస్యలు తెలుసుకొని, మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమావేశం లో అయన మాట్లాడుతూ గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. హెల్త్ స్కీమ్ వర్తించే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. గురుకుల పాఠశాల పని వేళల మార్పునకు ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు శ్రీపాల్ రెడ్డి ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేశారని, త్వరలోనే ఉత్తర్వులు వస్తాయాన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ వర్తించే విధంగా పిఆర్టియు టిఎస్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పొన్నం రమేష్, బొమ్మకంటి రవి కుమార్, రాష్ట్ర కార్యదర్శి జాదవ్ వసంత రావు, మండల అధ్యక్షులు అంతడుపుల గంగారాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య లు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం



మిర్యాలగూడ , జూలై 29:- (వార్త మిర్రర్)ఈ నెల 28 రాత్రి సుమారు 8 గంటలకు ఒక గుర్తు తెలియని 50-55 సం.ల మధ్య వయసున్న మగ మనిషి మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతం లోని ఆర్పిఎఫ్ కొత్త బిల్డింగ్ కు ఉత్తరాన వాటర్ ట్యాంక్ తండాకు వెళ్ళే రోడ్డుకు 70 మీటర్ల దూరంలో ఖాళీ స్థలంలో చనిపోయి అతని శరీరం పై రంగు డ్రాయర్ మాత్రమే ధరించి ఉన్నాడని మిర్యాలగూడ రూరల్ పోలీసు ఎస్ఐ ఎం.లక్ష్మయ్య తెలిపారు. స్థానికుల సమాచారము ప్రకారం గుర్తుతెలియని మగ మనిషి గత వారం రోజుల నుండి మిర్యాలగూడ రైల్వే స్టేషన్ పరిసరాలలో బిక్షాటన చేస్తూ తిరుగుచు%శీ%డేవాడని తెలిసినదనీ తెలిపారు, మగ వ్యక్తి ఇప్పటివరకు ఎవరు గుర్తించనందున, శవాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురి నందు భద్రపరచినట్లు తెలిపారు. రైల్వే పోలీస్ ఫోర్స్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, మృతుల గుర్తింపు గురించి, అన్నీ ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.



## భక్తి శ్రద్ధలతో ఘనంగా నాగుల పంచమి వేడుకలు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 29: చౌటుప్పల్ మున్సిపల్ పరిధి పైలాన్ పార్కులో సోమవారం రోజున నాగుల పంచమి పండుగ వేడుకలను మాజీ కౌన్సిలర్ కామిశెట్టి శైలజ,మహిళా భక్తులు మహిళలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఉదయాన్నే స్థానిక ఆలయాలకు చేరుకుని దైవ దర్శనం తర్వాత మహిళలు అవరణలో గల నాగుల పుట్ట వద్దకు చేరుకుని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి, పుట్టలో పాలు పోశారు. ఈ కార్యక్రమంలో కావ్య, వాణి,శ్రీజ,భవాని, సబిత,అనూష,నిరూప, కాసోజు సుజాత,కాసోజు నవీన్ కుమార్, జి. ఆంజనేయ చారి, పందుల ముత్యాలు, కాసోజు సాయి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు....

## తండ్రిని కత్తితో పొడిచిన తనయుడు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 29 : జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని కేశవ నగర్ లో కత్తిపోట్ల కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల లక్ష్మీనర్సయ్య (60) అనే వ్యక్తిపై అతని కుమారుడైన చిట్యాల రాజేందర్ పదునైన కత్తితో దాడి చేశాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన రాయికల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యం కోసం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## నాగదేవతకి ప్రత్యేక పూజాలు నిర్వహించిన
## మాజీ కౌన్సిలర్ దండ హిమబిందు అరుణ్ కుమార్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 29శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నాగుల పంచమి సందర్భంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున నాగదేవతకి పంచామృతాభిషేకములు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాగదేవత విగ్రహ దాతలు దండ అరుణ్ కుమార్ హిమబిందు దంపతులు నాగదేవతకి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం వేద పండితులు పెద్ది కిషోర్ శర్మ వేదమంత్రాలు చరణాల మధ్యన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి,కామిశెట్టి చంద్రశేఖర్ గుప్త,గుర్రం వెంకటేష్,వర్కాల వెన్నెల రవి గౌడ్, తూర్పాటి నరసింహ, పెద్ద ఎత్తున మహిళ భక్తులు పాల్గొన్నారు....

# జడ్పిటిసితో పాటు మెజారిటీ ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటాం

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి





సంస్థాన్ నారాయణపూర్ జూలై 29:( వార్త మిర్రర్)

భారతీయ జనతా పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల సమావేశం మండల కేంద్రంలోని జై హింద్ ఫంక్షన్ హాల్ లో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుర్వి రాజు గౌడ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెంది,ప్రజలలో పూర్తిగా వ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ పార్టీ గత 20 నెలలుగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా బీసీ రిజర్వేషన్ల పేరుతో కాలయాపన చేస్తూ ఆ నెపాన్ని బీజేపీ మీద నెట్టే ప్రయత్నం చేస్తున్నాడని ఆయన అన్నారు బిజెపి పూర్తిగా బీసీల పక్షపాతి అని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఒక బీసీని ప్రధానమంత్రిగా చేసిన పార్టీ అని,రాష్ట్రపతిని చేసే అవకాశం వచ్చిన రెండుసార్లు ఎస్సీ, ఎస్టీలను రాష్ట్రపతిగా చేసిన పార్టీ అని కేంద్ర క్యాబినెట్లో 65% ఎస్సీ ఎస్టీ బీసీలను కేంద్ర మంత్రులుగా చేసిన పార్టీ అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు,తెలంగాణ రాష్టంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో కేవలం ఇద్దరంటే ఇద్దరే బీసీలను మంత్రులుగా చేసిన బీసీ ద్రోహుల పార్టీ కాంగ్రెస్ అని ఆయన అన్నారు ఇవాళ రాజు గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలోని కార్యకర్తల ఉత్సాహాన్ని చూస్తుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో నారాయణపురం మండలంలోని అత్యధిక ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుని ఎంపీపీని కైవసం చేసుకుంటామని జెడ్పిటిసిని కూడా గెలుచుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల ఇన్చార్జి రమణ గోని శంకర్ జిల్లా ఉపాధ్యక్షులు బచ్చబోయిన దేవేందర్ యాదవ్,ఓబిసిరాష్ట్ర మోర్చా కార్యదర్శి జక్కలి రాజు యాదవ్,అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్,జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసోజు వెంకటాచారి,భాస్కర నరసింహ మండల ప్రధాన కార్యదర్శిలు బండమీది కిరణ్, చిలువేరు వెంకటేష్,మండల ఉపాధ్యక్షులు సంపతి సుధాకర్ రెడ్డి, ఎలిజాల శీను, కట్కూరి లక్ష్మీ వెంకటేష్ గౌడ్,వెంకటేష్ గౌడ్,కార్యదర్శిలు జక్కర్తి నరసింహ మర్రి లక్ష్మీనరసింహ, కోడూరు బీరప్ప,జర్పుల వినోద్ కుమార్ జిల్లా నాయకులు జక్కర్తి బిక్షపతి నందగిరి జగత్ కుమార్, ఆత్కూరి రాములు,సురపల్లి జవహర్ ఉష్కాగుల గిరిబాబు సంగిశెట్టి లక్ష్మీనారాయణ హాథిరాం నాయక్ సుర్వి లింగస్వామి గౌడ్ ఎలిమినేటి రాజేందర్ రెడ్డి రాజేందర్ నాయక్ బాలు నాయక్ సుర్వి నరేష్ గౌడ్, గుండు లింగస్వామి గౌడ్ శక్తి కేంద్రాల ప్రబారీలు,ప్రముఖ్ లు బూత్ అధ్యక్ష,కార్యదర్శులు వివిధ మోర్చాల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# రిజర్వేషన్ పై రాష్టంలోని అఖిలపక్షాల పార్టీలను
# ఢిల్లీకి తీసుకెళ్లి బిసి రిజర్వేషన్ సాధనకై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

### సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య
### బీసీ రిజర్వేషన్ పై-బిజెపి వైఖరి స్పష్టం చేయాలి...





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 29 : సిపిఎం పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా విస్తృత స్థాయి సమావేశం చౌటుప్పల మున్సిపాలిటీ లోని లింగారెడ్డి గూడెం ఎమ్మెస్ ఫంక్షన్ హాల్ నందు మంగళవారం రోజున నిర్వహించుకోవడం జరిగింది. సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు గోశిక స్వామి జెండా ఆవిష్కరణ చేసి సమావేశాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్టంలో స్థానిక ఎన్నికలలో 42% బిసి రిజర్వేషన్ అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ పై స్పష్టత ఇవ్వకుండా నాన్చుడు ధోరణిని తో తెలంగాణ ప్రజలకు అన్యాయం చేస్తుంది అన్నారు. తక్షణమే బీసీ రిజర్వేషన్ పై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.బీసీ రిజర్వేషన్ పై రాష్ట్రంలోని అఖిలపక్షాల పార్టీలను ఢిల్లీకి తీసుకెళ్లి బిసి రిజర్వేషన్ సాధనకై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. సిగాచి పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో నేటికీ 50 మంది మరణించినప్పటికీ కుటుంబాలకు అందవలసిన ఆర్థిక సహాయం నేటికీ అందలేదని అన్నారు.తక్షణమే ప్రభుత్వం బాధ్యత వహించి వారి కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.. ఈ సమావేశానికి సిపిఎం పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ,బట్టు పెల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరు బాలరాజు,కల్లూరు మల్లేశం,జనీ గల పెంటయ్య,బూర్గు కృష్ణారెడ్డి,దాసరి పాండు, గుంటోజు శ్రీనివాస చారి,మండల కార్యదర్శి గంగాదేవి సైదులు,చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్,రాగిరి కిష్టయ్య, అవ్వారీ రామేశ్వరి,ఆదిమూలం నందీశ్వర్, బోయ యాదయ్య,పల్లె మధు,బత్తుల దాసు, తిగుల్ల శ్రీను, తదితరులు పాల్గొనడం జరిగింది.

# వడ్డీ సొమ్ము వచ్చిందా..

**ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సభ్యుల ఈపీఎఫ్ ఖాతాల్లో 8.25 శాతం వార్షిక వడ్డీ సొమ్మును జమ చేయడం ప్రారంభించింది. మీరు ఈపీఎఫ్ మెంబర్ అయితే మీ పాస్‌బుక్ ద్వారా ఆన్‌లైన్‌లోనే అప్డేట్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. వడ్డీ సొమ్ము ఇంకా కనిపించకపోయినా కంగారు పడకండి. దీనికి మరికొన్ని రోజులు పట్టొచ్చు. ఈపీఎఫ్ఓ ఇంకా ఎటువంటి అధికారిక ఎస్ఎంఎస్ లేదా ఈ-మెయిల్ పంపలేదు. కానీ చాలా మందికి ఇప్పటికే తమ పాస్ బుక్‌లో వడ్డీ సొమ్ము జమ అయినట్లు కనిపిస్తోంది.**




**వడ్డీ రేట్లకు ఆర్థిక శాఖ ఆమోదం**

గత ఫిబ్రవరిలో జరిగిన ఈపీఎఫ్ఓ సీబీటీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్) సమావేశంలో ఈపీఎఫ్‌పై ప్రతిపాదించిన 8.25 శాతం వార్షిక వడ్డీ రేటును ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల ఆమోదించింది. ఈ ఆమోదం తర్వాత ఈపీఎఫ్ఓ వడ్డీ జమ చేసే ప్రక్రియను ప్రారంభించింది. దేశంలో సుమారు 8 కోట్ల ఈపీఎఫ్ ఖాతాలు ఉన్నాయి.

**వడ్డీని ఎలా లెక్కిస్తారు?**

ప్రతి నెలా ఉద్యోగి, యజమాని ఇద్దరూ ఈపీఎఫ్ ఖాతాకు కంట్రిబ్యూషన్ చేస్తారు. ఉద్యోగి మూల వేతనంలో 12 శాతం కంట్రిబ్యూషన్ చేస్తారు. యజమాని వాటా కూడా 12 శాతం ఉంటుంది. అయితే ఇది పెన్షన్ పథకానికి 8.33%, ఈపీఎఫ్ ఖాతాకు 3.67% చొప్పున జమ చేస్తారు. ఈపీఎఫ్ఓ నెలవారీ వడ్డీని లెక్కిస్తుంది. కానీ ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత మాత్రమే జమ చేస్తుంది. చక్రవడ్డీని ఉపయోగించి వడ్డీని లెక్కిస్తారు. ఇది ఉద్యోగి, యజమాని కంట్రిబ్యూషన్స్ రెండింటికీ వర్తిస్తుంది (పెన్షన్ భాగం మినహా). సాధారణంగా జూన్ నుంచి ఆగస్టు మధ్య వడ్డీ జమవుతుంటుంది.

**వడ్డీ జమయిందో లేదో చూసుకోండిలా..**

- స్టెప్ 1: ఈపీఎఫ్ఓ అధికారిక వెబ్‌సైట్ ( epfindia.gov.in% )సందర్శించండి
- స్టెప్ 2: అవర్ సర్వీసెస్ ∩ ఫర్ ఎంప్లాయీస్ ∩ మెంబర్ పాస్‌బుక్‌కు వెళ్లండి
- లేదా నేరుగా లింక్‌ను క్లిక్ చేయండి.
- స్టెప్ 3: యూఏఎన్, పాస్వర్డ్, క్యాప్చా ఉపయోగించి లాగిన్ అవ్వండి.
- స్టెప్ 4: ఇక్కడ మీ అన్ని మెంబర్ ఐడీలు (మునుపటి, ప్రస్తుత కంపెనీలతో లింక్ అయినవి)కనిపిస్తాయి.

స్టెప్ 5: పాస్‌బుక్ చూడటానికి ప్రస్తుత మెంబర్ ఐడీపై క్లిక్ చేయండి

- పాస్‌బుక్‌లో ఉద్యోగి కంట్రిబ్యూషన్, కంపెనీ కంట్రిబ్యూషన్, జమ అయిన వడ్డీ కనిపిస్తాయి. దీన్ని పీడీఎఫ్ గా కూడా డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

**వడ్డీ సొమ్ము ఇంకా కనిపించకపోతే..**

కొన్నిసార్లు వడ్డీ జమ అయిన తర్వాత కూడా పాస్ బుక్‌లో ప్రతిబింబించడానికి సమయం పడుతుంది. కొన్ని రోజులు వేచి చూసి మళ్లీ తనిఖీ చేయండి. అప్పటికీ కనిపించకపోతే ఆన్‌లైన్లో లేదా సమీపంలోని ఈపీఎఫ్ఓ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయవచ్చు.